క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సంక్రాంతి పండుగను పురష్కరించుకుని గ్రామాల్లో నిర్వహిస్తున్న అమ్మవారి జాతర్లకు తరలివచ్చిన భక్తులు కూడా అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అల్లు రామలింగయ్యకు నివాళి



రామలింగయ్య విగ్రహం వద్ద అల్లు అరవింద్

పాలకొల్లు సెంట్రల్: మండలంలని లంకలకోడేరు గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి సినీ నిర్మాత అల్లు అరవింద్ అతని సోదరి హాజరయ్యారు. ఆదివారం కార్యక్రమం అనంతరం పట్టణానికి విచ్చేసిన అరవింద్ స్థానిక చిన్నకార్ల స్టాండ్ వద్ద ఉన్న తన తండ్రి అల్లు రామలింగయ్య విగ్రహానికి పూలమాలలు వేయడానికి వచ్చారు. పైకి ఎక్కడానికి వీలు లేకపోవడంతో రామలింగయ్య కాళ్ల వద్ద పూలమాలలను పెట్టి నివాళులర్పించారు. ఈయన వెంట చిరు ఫ్యాన్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా రామలింగేశ్వరరావు, అల్లు రాధాకృష్ణలు ఉన్నారు.

మహిళ మృతిపై ఆందోళన

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన ఒక మహిళ అనారోగ్య కారణంగా భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ వైద్య సిబ్బంది చేసిన ఇంజెక్షన్ వికటించి 26 ఏళ్ల వయస్సు ఉన్న ఒక మహిళ మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆదివారం రాత్రి సదరు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

23న ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలల గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరంను మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి, ఉచిత వైద్య చికిత్స చేయనున్నారు. ఈ శిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు.

అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రిటైర్డ్ ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ భూపతిరాజు సత్యనారాయణరాజు కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్ వాహనాన్ని చిన అమిరం విశ్వశాంతి వృద్ధాశ్రమ ఆవరణలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద ఫౌండేషన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, భీమవరం మానవతా సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు, కార్యదర్శి కార్మూరి నరసింహమూర్తి(బాబు), చేకూరి ఝాన్సీలు భూపతిరాజు సత్యనారాయణ రాజును సత్కరించారు. కంతేటి వెంకట్రాజు, వంకాయల రామారావు, కాకర్ల వినాయక్ ,చెరుకువాడ రంగసాయి సన్నిధి నాగభూషణం , దాయన చంద్ర జి, అల్లు శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిపరాశక్తి ఆలయానికి తరలిన భక్తులు

ఆకివీడు : ఆదిపరాశక్తి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆకివీడు నుంచి తమిళనాడులోని మేల్ మరువత్తూర్‌కు భక్తులు బయలుదేరారు. ఎర్ర వస్త్రాలతో మాల ధరించిన వారు అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలులో బయలుదేరి వెళ్లారు.

పట్టణ సుందరీకరణపై మున్సిపాలిటీ దృష్టి



రైల్వేస్టేషన్‌రోడ్డులో డివైడర్ వద్ద అధ్వానంగా నాడు(ఫైల్)



అదే ప్రాంతంలో నేడు అందంగా ఆధునీకరించిన దృశ్యం

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. కొంత కాలంగా సుందరీకరణ విషయంలో పట్టణంలో నిర్లక్ష్యం జరిగింది. దీంతో ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తూ ఉండేవి. పాలకొల్లు రోడ్డు లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌ఫామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు అవన్నీ శిథిలమయ్యాయి. ఇక రైల్వేస్టేషన్‌రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డులో నిర్మించిన డివైడర్లు శిథిలస్థితికి చేరుకున్నాయి.

సుందరమయంగా

ఇటీవల కాలంలో కాటన్‌పార్కును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే పాడవతుతున్న ఏటిగట్టు పటిష్టపరిచే పనులు కూడా పూర్తి చేశారు. ఇక ఏటిగట్టు పొడవునా సుందరీకరణ పనులు కూడా చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. అదే క్రమంలో రైల్వేస్టేషన్‌రోడ్డులో వీధిదీపాలు ఆధునీకీకరించారు. డివైడర్లను పూర్తిగా ఆధునికీకరించి అందంగా తయారు చేశారు. మిషన్‌హైస్కూల్‌రోడ్డులో కూడా డివైడర్లను ఆధునీకీకరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం కొత్త అందాలను సంతరించుకుంది. పట్టణసుందరీకరణ విషయంలో చేపడుతున్న అభివద్ధి పనులపై పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం



పట్టణ సుందరీకరణపై పూర్తిస్థాయిలో దృష్టి పెడుతున్నాం. ముఖ్యంగా గోదావరిగట్టు పొడవునా అందంగా తీర్చిద్దిడానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో గోదావరిగట్టు వద్దకు విహారం కోసం పెద్ద ఎత్తున జనం వస్తున్నారు. గట్టు పొడవునా ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా చర్యలు చేపడతాం. కాటన్‌పార్కును అందంగా తీర్చిదిద్దాం. పట్టణంలో ప్రధాన రహదారులను కూడా పునర్నిర్మిస్తున్నాం.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్

గ్రామాల్లో అమ్మవార్ల జాతరల సందడి



మొగల్తూరు: సత్తెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చీఫ్ విప్ ముదునూరి



మొగల్తూరు: పేరుపాలెంలో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: మొగల్తూరులో ఉన్న శ్రీ సత్తెమ్మ అమ్మవారి జాతరలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతరను ఆదివారం వేకువ జామునుండి సోమవారం ఉదయం వరకూ జాతర ను ఘనంగా నిర్వహిస్తారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ప్రసాదరాజుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రసాదరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకులను అభినందించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుబ్బల రాధాకృష్ణ, దూసనపూడి దొరబాబు, తన్నీడి గిరి, కుక్కల కృష్ణమోహన్, పడవల సత్యనారాయణ, ముక్కు గోపాల కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అన్నసమారాధన

మొగల్తూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేరుపాలెం సౌత్ గ్రామంలో ఉన్న మొగదారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించిన చౌదుల రాజును, అమ్మవారికి 4 కేజీల బరువైన వెండి కిరీటాన్ని బహుకరించిన కత్తుల కృష్ణను ఘనంగా సన్మానించారు. అంతేకాక అమ్మవారికి సత్తినేని రామకృష్ణ, సత్యవతి దంపతులు సమర్పించిన 18 కేజీల లడ్డూకు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన పేరుపాలెం పెద్దిరాజు రూ32వేలకు దక్కించుకున్నారు.

వెలివెలలో

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెలలోలోని వెలగలమ్మ జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో భాగంగా గ్రామంలో అమ్మవారికి ఏర్పాటు చేసిన పూరిగుడిసె వద్ద ప్రత్యేక పూజలు, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. రాత్రి అమ్మవారికి ఘనంగా జాతర నిర్వహించనున్నారు. బుధవారం భక్తులు నిప్పులగుండం తొక్కి అమ్మవారికి ఊయల సేవ నిర్వహించి గుడికి సాగనంపుతారు. ఉత్సవ కమిటీ జాతరకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు, ఆగర్రు గ్రామ సచివాలయాల వద్ద సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. అలాగే మంగళవారం అరట్లకట్ల గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దళితరత్న అవార్డు అందుకున్న పుష్పరాజ్

పెనుగొండ: ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం ఏలూరులో గౌతమ బుద్ధ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ చాగంటి సంజీవ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆచంట వేమవరంలో వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ మంచల్ల ఇస్సాక్, దళిత సీనియర్ నాయకులు కాపుదాసి రవికుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నంది జయరాజు, జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, భీమవరం పట్టణ కార్యదర్శి నేతల సాల్మన్ రాజు, ఆచంట నియోజకవర్గ క్రాయదర్శి సాక బాబు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముని శోభాయాత్రలు



పాలకొల్లు సెంట్రల్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పెనుగొండ: సిద్ధాంతంలో బాల రాముని అక్షింతలకు పల్లకీ సేవ

పాలకొల్లు సెంట్రల్: అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్న సందర్భంగా పట్టణంలో అయోధ్య బాలరాముని శోభాయాత్ర నిర్వహించినట్లు పట్టణ శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి సేవా సమితి అధ్యక్షులు శీరం ఆనందకృష్ణ తెలిపారు. ఆదివారం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించారు. ఈ శోభాయాత్ర కార్యక్రమంలో పట్టణ ధర్మపరిరక్షణా సమితి, హిందూ సంఘాల సభ్యులు, హిందువులు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ శోబాయాత్ర మెయిన్‌రోడ్డు మీదుగా గజలక్ష్మీ సెంటర్ నుండి కంచి కామాక్షి అమ్మవారి ఆలయం , ముచ్చర్ల వారి వీధిలో రామాలయం, కంచర్ల వారి వీధి రామాలయం, బుధవారపు వీధి రామాలయం, వెలమగూడెం రామాలయం వద్దకు వెళ్లి యాత్రను ముగించారు. సుమారు 200 వందల మీటర్ల పొడవున్న జై శ్రీరామ్ నామంతో ఉన్న జెండాతో ఊరేగింపులో పాల్గొన్నారు. యాత్రలో పాల్గొన్న భక్తులకు దారి పొడవునా దాతలు మజ్జిగ, పండ్లు, డ్రింగ్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకులు పి రమణ స్వామి, క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు గాదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జై శ్రీరామ్ పేరుతో ప్రచారం

పాలకొల్లు సెంట్రల్: అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా పట్టణంలో వివిధ రామాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. రామాలయాలను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తులు తిలకించే విధంగా రామాలయాల వద్ద ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రతి ఇంటికి శ్రీరాముని జెండాలను కట్టి ఇంటి గోడలపై జై శ్రీరామ్ అంటూ పేర్లను రాశారు. ఉదయం 9 గంటల నుంచి లైవ్ కార్యక్రమాలను తిలకించే విధంగా పందిళ్లు కుర్చీలు ఏర్పాటు చేశారు. రోడ్డుపై వెళ్లే ఆటోలు, కార్లు, మోటర్ వాహనాల యజమానులు తమ వాహనాలపై జై శ్రీరామ్ అంటూ నామం రాయించుకున్నారు.

ఆకట్టుకున్న పల్లకీ సేవ

పెనుగొండ: అయోధ్య రాములు అక్షింతలకు సిద్ధాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీపై గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం చౌదరీ రామాలయం వద్ద పూజలు భక్తి శ్రద్ధతలో నిర్వహించిన అనంతరం సన్నాయి మేళాలతో జై శ్రీరామ నినాదంతో ఉత్సవం నిర్వహించి, ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించనున్న శ్రీరామ జన్మభూమి అందించిన అక్షింతలను అందరూ పూజా మందిరంలో ఉంచి ఐదు దీపాలు వెలిగంచి, రామ నామం జపిస్తూ పూజలు నిర్వహించాలని నిర్వాహకులు కోరారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న తిరుమాని నాగరాజు

నరసాపురం రూరల్: యువత క్రీడారంగంపై దృష్టి సారించి క్రీడల్లో విజయం సాధించడం ద్వారా దేశ, విదేశాల్లో మన ప్రతిష్టను ఇనుమడింపజేసుకోవచ్చని రాష్ట్ర అగ్నికుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. మండలంలోని ఎల్బీచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షురాలు మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లోని ఐదు విభాగాల్లో పురుషుల విభాగంలో క్రికెట్ వేములదీవి తూర్పు, వాలీబాల్‌లో వేములదీవి తూర్పు, కబడ్డీలో సీతారాంపురం సౌత్, కోకోలో చామకూరిపాలెం బ్యాట్‌మెంటన్‌లో లక్ష్మణేశ్వరం-1 సచివాలయాలు, స్త్రీల విభాగంలో క్రికెట్ తూర్పుతాళ్లు-2, వాలీబాల్ లో వైఎస్‌పాలెం, కబడ్డీలో పీఎం లంక, కోకో లో వైయస్‌పాలెం, బ్యాడ్‌మెంటిన్‌లో చామకూరిపాలెం సచివాలయాలు విజేతలుగా నిలిచాయని వ్యాయామోపాధ్యాయులు తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి క్రీడా పరికరాలను అందజేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎస్సై మోహన్‌రావు, సర్పంచ్ బాలకృష్ణ

భీమవరం అర్బన్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల బంధుత్వ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కేతా నాగబాబు, తేలి జోషఫ్ రవికుమార్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన



కొడమంచిలిలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

పెనుగొండ: మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో కొడమంచిలి అరుందతీపేటలో డ్రెయిన్ నిర్మించినట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. ఆదివారం ఆయన డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలించారు. అరుందతీపేటలో టీడీపీ ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా రాజకీయంగా వాడుకుని వదలేశారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నిర్మాణం పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండేటి రమేష్, పార్టీ నాయకులు పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్, పంచాయతీ సభ్యుడు పుచ్చకాయల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానవ సంబంధాలు మెరుగు



మేడపాడులో క్రికెట్ టోర్నమెంట్ విజేత ట్రోఫీతో ఏనుగువానిలంక జట్టు సభ్యులు

యలమంచిలి: క్రీడలతో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల మధ్య మానవ సంబంధాలు బలపడతాయని మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు అన్నారు. మేడపాడులో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన అడ్డాల మోహన రంగప్రసాద్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏనుగువానిలంక జట్టు గెలుచుకుంది. మేడపాడు, ఏనుగువానిలంక జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా ఏనుగువానిలంక జట్టు విజేతగా నిలిచింది. విజేతల బహుమతీ ప్రదానోత్సవ సభలో వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే వారు చేసే పని, ఉద్యోగంతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, గ్రామ మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు గ్రామ పెద్దలు దేగల వెంకటేశ్వరరావు, గంటా సూర్యప్రకాష్, గంటా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

పెనుగొండ: కొడమంచిలిలో చినపేటకు చెందిన పుచ్చకాయల జయకృష్ణకు చెందిన గడ్డివాము దగ్ధమైంది, ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపులోనే పూర్తిగా దగ్ధమైంది. అసలే గడ్డి కొరతతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పూర్తిగా దగ్ధం కావడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు, ఎనిమిది ఎకరాల గడ్డి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.50వేలు నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే గర్వకారణం



తిర్రే బాబూరావు

నరసాపురం: విజయవాడ నగరంలో సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం దేశానికే గర్వ కారణమని షెడ్యూల్‌కులాల సంక్షేమసంఘం నరసాపురంశాఖ అధ్యక్షుడు, రిటైర్డ్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిర్రే బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ మహాశయుడు ఓ కులానికో, ఓ మతానికో ప్రతినిధి కాదన్నారు. దేశంలో సామాజిక న్యాయం కోసం పరితపించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎందరో రాజకీయ నేతలు వచ్చారని, ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. కానీ అంబేడ్కర్ స్ఫూర్తిని, లక్ష్యాలను నెరవేర్చే విధంగా కొందరు నేతలు మాత్రమే పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయ సాధనకు మొదటి నుంచి పనిచేస్తున్నారని చెప్పారు.

షర్మిల మాటలను ప్రజలు విశ్వసించడం లేదు



చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: వైఎస్ షర్మిల మాటలను ప్రజలు విశ్వసించడం లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. ఈ మేరకు పాలకొల్లులో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. షర్మిల మొన్నటివరకు తెలంగాణ బిడ్డనని చెప్పారని, ఇప్పుడేమో ఏపీలో కాంగ్రెస్‌ని బతికిస్తానంటూ బయల్దేరారని ఎద్దేవా చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలో భాగంగానే వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆనందప్రకాష్ విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి మల్లవరం లంక గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు, శేషవేణి దంపతులు నాలుగు గ్రాముల బంగారం సమర్పించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదు అందజేశారు.